# సుమిత్ర

పుత్రకామేష్టి యాగము జరిగిన తరువాత యాగప్రసాదమైన పాయసమును వసిష్ఠులవారు తెచ్చి దశరథునికి యిచ్చారు. దశరథుడు తన ముగ్గురు భార్యలకు దానిని సమానంగా పంచాడు. కౌసల్య పట్టపురాణి. ఆమెకు పుట్టిన బిడ్డకు తప్పక రాజ్యం చిక్కుతుందని ధైర్యం వుంది. ఇదికాక, పెండ్లికి పూర్వము కేకయ మహారాజు దగ్గర దశరథుడు, ‘ నీ కుమార్తెకు పుట్టిన పిల్లవానికి రాజ్యపట్టాభిషేకం చేస్తా’నన్నాడు. దీనివలన కౌసల్య, కైకేయిలు ఆనందంగా పాయసం తీసుకున్నారు. రెండవ భార్య సుమిత్ర చాలా గుణవంతురాలు, పవిత్రమైన హృదయము కలిగినది. సుమిత్ర ఆ పాయసపు కప్పును తీసుకొని మేడపైకి పోయింది. శిరస్నానము చేయటంచేత ఆమె ఆ గిన్నెను అక్కడ పెట్టి తల ఆర్పుకుంటూ నిలబడింది. ఇంతలో ఎక్కడనుండి వచ్చిందో ఒక గరుడ పక్షి వచ్చి ఆ కప్పును తన్నుకొని పోయింది. ఇది చూసి చాలా భయపడిపోయింది సుమిత్ర. ‘నేను అలక్ష్యం చేయటంచేతను, అజాగ్రత్తగా వుండటంచేతను ఈవిధంగా జరిగిపోయింది. కౌసల్య, కైకేయిలు ఏవిధంగా భావిస్తారో ఏమో’ అని చాలా మథనపడింది. క్రిందికి వచ్చి చెప్పింది, ‘గ్రద్ద నా పాయసం గిన్నెను తన్నుకుపోయింది’ అని. కౌసల్య, కైకేయిలు చాలా గుణవంతులు. గొప్ప కీర్తిని పొందినవారు. అప్పుడు కైక, ‘అక్కా! మీరు బాధపడనక్కరలేదు. మనం ముగ్గురం ఒక్కటే. ముగ్గురం సమభాగములుగా పాయసం పంచుకుందాం’ అని చెప్పింది. ఈ కాలంలో ఆవిధమైన ఐకమత్యం వుందా? లేదు. ఈ సవతులలో వున్న ప్రేమతత్త్వం, నిరహంకారం, ఐకమత్యం ఎంత పవిత్రమో మీరు విచారించండి. తన కప్పులో అర్ధ భాగాన్ని ఆమె కప్పులో పోసింది కైక. పట్టపురాణియైన కౌసల్య, ‘మన ముగ్గురం సమానులమే. నాదికూడా అర్ధభాగం యిస్తున్నా’ అని ఆమె అర్ధభాగం ఆ కప్పులో పోసింది. ఈ ముగ్గురూ తమ పాయసం కప్పులను తీసుకొని వసిష్ఠులవారి దగ్గరకు వెళ్ళారు. యజ్ఞదేవతకు సమస్కారంచేసి ఆ పాయసమును సేవించారు. కొన్ని నెలలకు కౌసల్య, కైకేయిలకు ఒక్కొక్కరు, సుమిత్రకు ఇద్దరు కుమారులు పుట్టారు. లక్ష్మణుడు రాముని అంశం, శత్రుఘ్నుడు భరతుని అంశమని వసిష్ఠులవారు యోగదృష్టిచే గ్రహించారు. కౌసల్య, కైక ఇరువురూ ఒకచోట వుండిన సమయంలో సుమిత్ర అక్కడకు వెళ్ళి, ‘అక్కా! చెల్లీ! మీ యిద్దరి ప్రసాదమే ఈ పిల్లలు. లేకపోతే నాకు బిడ్డలెక్కడ? కనుక, ఒక బిడ్డను నీ కుమారుని సేవకోసం, ఒక బిడ్డను నీ కుమారుని సేవకోసం’అని చెప్పి, రాముని సేవకోసం లక్ష్మణుని, భరతుని సేవకోసం శత్రుఘ్నుని అర్పితం చేసింది. ‘నేను నిమిత్తమాత్రురాలను. ఈ పిల్లలు మీ ప్రసాదాలే. వీరు సేవలు చేసే నిమిత్తమే నా గర్భములో పుట్టారు. నేనెంతో ధన్యురాలను. ఇలాంటి సేవకులను లోకానికి అందించటమనేది నాకు గొప్ప అదృష్టము’ అని తనలో తాను ఎంతో ఆనందించింది.

సుమిత్ర గొప్ప గుణవంతురాలు. ఆమె పేరే సు-మిత్ర. సుమిత్ర పేరుకు తగిన మిత్రురాలు ఆమె. సహృదయురాలు. ఆమె ఆదర్శము సాటిలేనిది. రాముడు అరణ్యానికి వెళ్ళేముందు తల్లియైన కౌసల్యకు నమస్కరించినప్పుడు ఆమె, ‘నాయనా! నేను నిన్ను విడచి క్షణమైనా వుండలేను’ అని విలపించింది. అప్పుడు సుమిత్ర కౌసల్యను సమీపించి, కౌసల్యకు ధైర్యం చేబుతూ, ‘అక్కా! మీరెందుకు బాధపడుతున్నారు? సాక్షాత్తు నారాయణుడే నీ గర్భమందు శ్రీరాముడుగా జన్మించాడు. మానవాకారం ధరించినందులకు అతడు కాల, కర్మ, కర్తవ్యాలను పురస్కరించుకొని ప్రవర్తించాలి. లోకోద్ధరణ నిమిత్తమై జన్మించిన రామునికి ఎట్టి ఆపదలూ కల్గవు. ఏదో ప్రాపంచిక దృష్టితో ఈ మానవ దేహము అని తలచుకుంటే, దానిని చూచుకోటానికి లక్ష్మణుడున్నాడు. నా కుమారుడైన లక్ష్మణుడు రాముని సేవకుడే. రాముని చూచుకోటానికి లక్ష్మణుడున్నాడు. ఏమాత్రం భయపడనక్కరలేదు’ అని సమాధానపరచింది. కౌసల్య బాధపడే సమయంలో సుమిత్ర ఎట్టి బోధలు చేసిందంటే, అట్టి ఘనమైన బోధలు చేసింది. రామాయణంలో సుమిత్ర బోధలు వివరించేవారు లేరు. ‘ఇదంతా దైవముయొక్క మాస్టరుప్లానే. నీవు, నేను

వేసేవి కావు. లోకోద్ధరణ నిమిత్తమై, ధర్మసంస్థాపన నిమిత్తమై ఈవిధంగా భగవంతుడే అన్నీ నిర్ణయిస్తాడు. కనుక, అక్కా! నీవేమాత్రం కంటిధారలు పెట్టవద్దు. కుమారుడు అరణ్యవాసమునకు పోతుంటే కంటిధారలు పెడుతుంటే అపశకునమౌతుంది. నవ్వుతూ ఆశీర్వదించు'అని చెప్పి కౌసల్యకు ధైర్యాన్ని బోధిస్తూ వచ్చింది సుమిత్ర.

తన కుమారుడు లక్ష్మణుడు వచ్చి తనకు నమస్కరించినప్పుడు సుమిత్ర అతనికి ఏమని బోధించింది? 'నాయనా! నీవు అరణ్యానికి వెడుతున్నానని భావించవద్దు. సీతారాములు లేని అయోధ్యయే అరణ్యము. సీతారాములున్న అరణ్యమే అయోధ్య. రాముడే నీ తండ్రి. సీతయే నీ తల్లి. కాబట్టి వారిని ప్రేమతో సేవించటమే నీ ప్రధాన కర్తవ్యం' అన్నది.